క్లుప్తంగా

ఆకట్టుకున్న సైకత సూరీడు



రథసప్తమి సైకత శిల్పం

ఆమదాలవలస రూరల్: గాజులకొల్లివలస సమీపంలో సంగమేశ్వర ఆలయం వద్ద సైకత శిల్పి గేదెల హరికృష్ణ వేసిన సైకత శిల్పం ఆకట్టుకుంటోంది. రథసప్తమి నేపథ్యంలో ఇసుకతో ఆకాశంలో ఉన్న సూర్యుడి చిత్రం అందంగా తీర్చిదిద్ది శుభాకాంక్షలు తెలియజేశారు.

రాణ మాజీ సర్పంచ్ మృతికి సంతాపం


దుంగ అప్పారావు(ఫైల్)

జలుమూరు: రాణ పంచాయతీ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు దుంగ అప్పారావు(63) శుక్రవారం తన నివాసంలో అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన ఎంపీటీసీ, నీటి సంఘం అధ్యక్షులుగా పలువులు పదవులు నిర్వహించారు. భార్య జయలక్ష్మీ, కుమారుడు ప్రసాద్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈయన కోడలు ఉషాశాంతి సర్పంచ్‌గా ఉన్నారు. అప్పారావు మృతి పట్ల ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణ చైతన్య, ఎంపీపీ వాన గోపి, జెడ్పీటీసీ మెండ విజయ శాంతి, అల్లాడ, చల్లవానిపేట పీఏసీఎస్ నాయకులు ముసలినాయుడు, రాజప్పల నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కనుసు సీతారాం, నాయకులు ఎం.శ్యామలరావు, మెండ రాంబాబు, బుక్కా లక్ష్మణరావు, మూకళ్ల సత్యం, పైడి విశలరావు తదితరులు సంతాపం తెలియజేశారు.

చెత్త సంపద కేంద్రం ఏర్పాటుకు చర్యలు


స్థలాన్ని చదును చేయిస్తున్న అధికారులు

సరుబుజ్జిలి: కొత్తకోట గ్రామంలో చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఈఓపీఆర్‌డీ ఆనందబాబు తెలిపారు. శుక్రవారం గ్రామంలో చెత్తసంపద కేంద్రం స్థలాన్ని ఎంపిక చేసి చదును చేశారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌ఐ వెంకటగిరి, వీఆర్వో తిరుపతిరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయండి

సారవకోట: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని ఎంపీడీఓ విశ్వేశ్వరరావు సూచించారు. మండలంలో 15 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్మాణ పనులు ప్రారంభం కాలేదన్నారు. ఆయా పంచాయతీ కార్యదర్శులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశామన్నారు. ఆయనతో పాటు ఏపీఓ సత్యమూర్తి, తొగిరి సర్పంచ్ చల్లా తాతయ్య ఉన్నారు.

ఉపాధి పనుల పరిశీలన


ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రవీంద్రబాబు

బూర్జ: ఉపాధి హామీ వేతనదారులు ఎనిమిది గంటలు పని చేస్తే వేతనం గిట్టుబాటు అవుతుందని ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు అన్నారు. కొరగాం పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశిత కొలతల ప్రకారం పనిచేస్తే గరిష్ట వేతనం అందుతుందన్నారు. మస్టర్లలో అవకతవకలు లేకుండా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ కె.తిరుపతిరావు పాల్గొన్నారు.

ఆర్‌బీకే పరిశీలన


రికార్డులు పరిశీలిస్తున్న తహశీల్దార్ రమణారావు

బూర్జ: మండలంలో పెండింగ్‌లో ఉన్న ఎఫ్‌టీఓలను త్వరగా క్లియర్ చేయాలని తహశీల్దార్ ఎస్.రమణారావు సిబ్బందిని ఆదేశించారు. ఓ.వి.పేట రైతు భరోసా కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీపీసీలు, రైస్ మిల్లులకు పంపించాలని పెండింగ్ ఎఫ్‌టీఓ సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆయనతో పాటు వ్యవసాయాధికారి రాజేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

విపక్షాలది ఓర్వలేనితనం


వృద్ధుడికి కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- చంద్రబాబుది రెండు కళ్ల సిద్ధాంతం
- గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

పోలాకి: రాష్ట్రంలో విపక్షాలది ఓర్వలేని తనమే అని తేలిపోయిందని మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శుక్రవారం పోలాకి మండలం గాతలవలస పంచాయతీ బసివలసలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబుది రెండు కళ్ల సిద్ధాంతమని విమర్శించారు. ఆయనకు లోకేష్, పవన్ ఇద్దరూ రెండు కళ్లవంటివారని, ఇద్దరి పాదయాత్రలు చంద్రబాబు కనుసన్నల్లోనే జరుగుతున్నాయని చెప్పారు. పవన్ వారాహి వాహనంలో డీజిల్ కూడా చంద్రబాబు చలవేనని విమర్శించారు. అనంతరం పార్టీ సీఈసీ మెంబర్ ధర్మాన పద్మప్రియతో కలసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. పంచాయతీలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధిని తెలియజేశారు. దువ్వవలస, గోదాయివలస గ్రామాలకు రోడ్డు సదుపాయం కల్పించినందుకు స్థానికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కణితి కృష్ణారావు, నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమ ఫలాలు

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి


పాతపట్నం నాగవంశంవీధిలో మహిళకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: మూడేళ్లలో ప్రభుత్వం కల్పించిన సంక్షేమ ఫలాలను గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నట్లు పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పాతపట్నం-1 గ్రామ సచివాలయ పరిధిలోని నాగవంశపువీధి, మొండిగలవీధి, కుమ్మరివీధి, తెలకలవీధుల్లో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంట్లో కుటుంబ సభ్యులకు చేకూర్చిన ప్రయోజనాన్ని వివరిస్తూ సీఎం జగన్ రాసిన లేఖను కుటుంబాలకు అందజేశారు. 2వ విడతలో జగనన్న కాలనీలను మంజూరు చేస్తామని పలువురికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ దొర సావిత్రమ్మ, ఏఎంసీ చైర్మన్ కె.అర్జునుడు, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ వెంకటరమణ, ఏపీడీ తెంబూరు రవి, ఎంపీడీఓ పి.జయంత్ ప్రసాద్, ఏఓ అప్పలనాయుడు, తహసీల్దార్ కె.రవిచంద్ర, ఏపీఎం మనోరత్నం, ఎంపీఓ సురేష్, ఈవోపీఆర్‌డీ ప్రసాద్ పండా, పార్టీ నాయకులు పనుకు మోహన్, దొర పార్వతీశం, ఏనుగుతల సూర్యం, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న మెళియాపుట్టి ఎంపీపీ రాణా ఈశ్వరమ్మ

మెళియాపుట్టి: వేసవిలో ఏ ఒక్క గ్రామంలోనూ తాగునీటి సమస్య రాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీపీ రాణా ఈశ్వరమ్మ అన్నారు. శుక్రవారం మెళియాపుట్టి మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు విచ్చలవిడిగా వెంచర్లు వేస్తున్నారని, అనుమతుల విషయమై అధికారులు దృష్టిసారించాలని, నిబంధనలు పాటించని యజమానులపై చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు కోరారు. సచివాలయాల్లో సమావేశాలు నిర్వహించే సందర్భాలలో ప్రజాక్షేత్రంలో విజయం సాధించిన ఎంపీటీసీలకు కనీసం విలువలేకుండా అధికారులు వ్యవహరించడం తగదని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. పాత తహశీల్దార్ ఉన్న సమయంలో అనవసర మ్యుటేషన్లు ఇచ్చి పట్టాలు సైతం ఇచ్చారని, దీనిపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. గొప్పిలి గ్రామానికి చెందిన 15 మంది రేషన్ కార్డుదారులకు తొమ్మిది నెలలుగా ఉచిత బియ్యం పంపిణీ చేయలేదని సివిల్ సప్లయ్ డీటీ భీమారావుకు పలుమార్లు తెలియజేసినా పట్టించుకోలేదని మండల కన్వీనర్ పల్లియోగి అన్నారు. ప్రతి ధాన్యపు గింజ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వ్యవసాయ అధికారి దానకర్ణుడు చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు ఉర్లాన బాలరాజు, ఎంపీడీఓ చంద్రకుమారి, తహశీల్దార్ సరోజిని తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్లను ఆదుకోవాలి


ర్యాలీ నిర్వహిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఆమదాలవలస: ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రైవేట్ ఎలక్ట్రికల్ అండ్ ప్లంబింగ్ వెల్ఫేర్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి మంతెన శ్రీనివాసరావు కోరారు. ఎలక్ట్రీషియన్ డే సందర్భంగా శుక్రవారం ఆమదాలవలస పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా ప్రభావంతో వర్కర్స్ ఆర్థికంగా ఇబ్బందులకు గురయ్యారని చెప్పారు. ప్రభుత్వం ఆర్థికంగా చేయూతనందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు ఎ.చంద్రశేఖర్, కె.హరి, డి.వి.జి.రమణ, వి.రవి, తేజ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి వేతనదారు మృతి


రత్నాలమ్మ(ఫైల్)

సరుబుజ్జిలి: మండలంలోని ఇస్కలపాలెం పంచాయతీ సుబ్బపేటకు చెందిన ఉపాధి హామీ పథకం వేతనదారు సురవరపు రత్నాలమ్మ(76) శుక్రవారం మృతి చెందింది. ఉపాధి పని చేస్తుండగా తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందినట్లు ఏపీఓ బొత్స పార్వతి తెలిపారు.

వ్యవసాయోత్పత్తుల నిల్వ కేంద్రానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: ప్రహరాజపాలెంలోని జగనన్న-లేఅవుట్ సమీపంలో రూ.15 లక్షలతో నిర్మించనున్న వ్యవసాయోత్పత్తుల నిల్వ కేంద్రం(ఎఫ్‌పీఓ) భవన నిర్మాణానికి ఎమ్మెల్యే రెడ్డి శాంతి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవనం అందుబాటులోకి వస్తే రైతులు తమ పంటలను నిల్వ చేసుకుని మద్దతు ధర వచ్చినప్పుడు అమ్మకాలు చేపట్టవచ్చన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఈఈ మురళి, ఎంపీపీ దొర సావిత్రమ్మ, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లు కె.అర్జునుడు, తాతయ్య, ఏపీఎం మనోరత్నం, ఎం.రామారావు, మండల హార్టికల్చర్ అధికారి మంగమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు పనుకు మోహన్, ఏనుగుతల సూర్యం, దొర పార్వతీశం, కుమార్‌రెడ్డి, జగదీష్, చంద్రయ్య, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో వివాహ రిజిస్ట్రేషన్ తప్పనిసరి


సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ మన్మధరావు

పాతపట్నం: ఆన్‌లైన్ వివాహ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని జిల్లా రిజిస్ట్రార్ కె.మన్మధరావు అన్నారు. పాతపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్‌పై అవగాహన కల్పించేందుకు హెల్ప్‌లైన్ డెస్క్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డుకు వివాహ రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేసిందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమాపతి, సంతోష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తూరు: మండలంలోని నేరడి, మాతల, సోమరాజపురం గ్రామ సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టులకు ఈ నెల 28లోపు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ బి.లావణ్య ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన, 18 నుంచి 35 ఏళ్ల బీసీ జనరల్ అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు.

సారవకోట: మండలంలో ఖాళీగా ఉన్న రెండు వలంటీర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎంపీడీఓ విశ్వేశ్వరరావు తెలిపారు. బద్రి పంచాయితీలో 5వ క్లస్టర్ ఓసీ మహిళకు, తొగిరి పంచాయతీలోని 12వ క్లస్టర్ బీసీ పురుషులకు కేటాయించినట్లు పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

ఆమదాలవలస: 33/11 కె.వి.పార్వతీశంపేట సబ్ స్టేషన్ పరిధిలోని 11 కె.వి.వెంకయ్యపేట ఫీడర్ మరమ్మతులు, చెట్లు కొమ్మలు తొలగించే పనుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ ఎస్.భయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పార్వతీశంపేట, రాధాకృష్ణాపురం, ప్రభుత్వ ఆసుపత్రి, మునగవలస స్టోన్ ఫ్యాక్టరీ, పెద్దపాలెం రైస్‌మిల్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, స్థానికులు గమనించాలని కోరారు.

ఎమ్మెల్యే పరామర్శ

పాతపట్నం: మండలంలో కొదూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గురాడి అప్పన్నకు ఇటీవల విశాఖపట్నంలో కాలికి గాయం కావడంతో ఆపరేషన్ చేయించుకున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కొదూరులోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి పరామర్శించారు. ఎంపీపీ దొర సావిత్రమ్మ, ఏఎంసీ చైర్మన్ కొండాల అర్జునుడు, నాయకులు పనుకు మోహన్, సూర్యం, సత్య బిస్వాల్, మంచు చంద్రయ్య పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

జలుమూరు: మండల సర్వసభ్యసమావేశం ఎంపీపీ వాన గోపి అధ్యక్షతన శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.వి.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఆయన కోరారు.

రథసప్తమికి ఏర్పాట్లు

సరుబుజ్జిలి: రెండో అరసవల్లిగా వర్ధిల్లుతున్న పురుషోత్తపురంలో సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో రథసప్తమికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అర్చకులు బి.వి.ఎస్.గోపాలరావు తెలిపారు. శనివారం వేకువజాము 4 గంటల నుంచి స్వామివారి నిజరూపదర్శనం ఉంటుందని పేర్కొన్నారు.

30న బడ్జెట్ సమావేశం

సరుబుజ్జిలి: ఈ నెల 30న ఉదయం 11 గంటలకు ఎంపీపీ కిల్లి రమాదేవి అధ్యక్షతన మండల బడ్జెట్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.వి.మురళీమోహన్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు విధిగా హాజరుకావాలని కోరారు.

30న సర్వసభ్య సమావేశం

సారవకోట: ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు అధ్యక్షతన ఈ నెల 30న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విశ్వేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొత్తూరు: మండలంలోని నేరడి కూడలి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరపాడుకు చెందిన కడగల సాయిరాం గాయపడ్డాడు. కొత్తూరు నుంచి హిరమండలం వైపు బైక్‌పై వెళ్తున్న సాయిరాం నేరడి వద్దకు వచ్చే సరికి ఎదురుగా వెళ్తున్న లారీ ఒక్కసారి పక్కకు రావడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో సాయిరాంకు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ కృష్ణారావు తెలిపారు.

ఐదుగురిపై కేసు నమోదు

పాతపట్నం: పాతపట్నంలోని నాగవంశపు వీధిలో శుక్రవారం ఉదయం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కనకాల నీలకంఠం అనే వ్యక్తి ఫ్లెక్సీలు కడుతుండగా అదే వీధికి చెందిన ఐదుగురు వ్యక్తులు ఫ్లెక్సీలు కట్టవద్దంటూ దాడి చేసినట్లు ఎస్‌ఐ ఎస్.కామేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు నీలకంఠం, వైఎస్సార్‌సీపీ నాయకుడు, వైస్ ఎంపీపీ సవిరిగాన ప్రదీప్‌ల ఫిర్యాదు మేరకు ఎంపీటీసీ సభ్యుడు కొండాల యరకయ్య, కృష్ణారావు, కె.రామారావు, పోలాకి నరేష్, కనకాల కర్రన్నలపై కేసు నమోదు చేశామని చెప్పారు.

పురస్కారాల విజేతలకు సత్కారం


మెళియాపుట్టి: అధికారులను సత్కరిస్తున్న ఎంపీపీ, అధికారులు


నరసన్నపేట: తహసీల్దార్‌ను సత్కరిస్తున్న సిబ్బంది

మెళియాపుట్టి: అధికారులు అందుకున్న పురస్కారాలే సేవలకు నిదర్శనమని ఎంపీపీ రాణా ఈశ్వరమ్మ అన్నారు. గణతంత్ర వేడుకల్లో భాగంగా ప్రభుత్వం నుంచి ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న తహశీల్దార్ సరోజిని, వ్యవసాయాధికారి దానకర్ణుడు, మండల పరిపాలనాధికారి తిరుపతి పట్నాయక్, ఏఎస్‌వో మనోహర్, చాపర పీహెచ్‌సీ ఏఎన్‌ఎం సునీతా పట్నాయక్‌లను శుక్రవారం మెళియాపుట్టి మండల పరిషత్ కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా సన్మానగ్రహీతలు మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల సహకారంతోనే పురస్కారాలు లభించాయని చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు ఉర్లాన బాలరాజు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మాధవరావు, నాయకులు బైపోతు ఉదయ్‌కుమార్, పల్లి యోగి, ఎంపీడీఓ చంద్రకుమారి, ఈఓపీఆర్‌డీ తారకేశ్వరి, ఏఈ శ్రీనివాసరావు, ఏపీఓ రవి, ఏపీఎం లలిత, సీడీపీఓ కామాక్షి తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: మండలంలో ఉత్తమ సేవలు అందించిన వీఆర్వోగా వి.బాలకృష్ణ, సర్వేయర్ బి.హరీష్, వీఆర్ఏ రవి, ఆఫీస్ సబార్డినేటర్ కె.చిరంజీవిలను తహశీల్దార్ పి.బాల శుక్రవారం జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. వసప వీఆర్వో (ఇన్‌చార్జి ఆర్ఐ) గిరిష్ కుమార్ పట్నాయక్ జిల్లా ఉత్తమ వీఆర్వోగా ఎంపిక కావడంపై కొత్తూరు తాలూకా యూనిట్ ఎన్‌జీఓ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లు తిరుపతిరావు హర్షం వ్యక్తం చేశారు.

నరసన్నపేట: రిపబ్లిక్ డే సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ అవార్డు పొందిన నరసన్నపేట తహసీల్దార్ ఏ.సింహాచలం, ఎలక్షన్ డీటీ శరత్‌లకు మండల వీఆర్వోలు, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది శుక్రవారం సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: పొందూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం సెక్రటరీ పి.శ్రీనివాసరావు గణతంత్ర వేడుకల్లో ఉత్తమ అధికారిగా పురస్కారం పొందడంపై ఏఎంసీ చైర్మన్ బాడాన సునీల్ కుమార్ హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బెండి బాబ్జీ, సిబ్బంది రాంప్రసాద్, త్రినాథరావు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉండండి

- అగ్రి ఎంటర్‌ప్రెన్యూర్ ప్రోగ్రాంలో ఎమ్మెల్యే కృష్ణదాస్


శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

నరసన్నపేట: గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు మరింతగా సేవలు అందించి అండగా నిలవాలని తద్వారా మీరూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట, శ్రీకాకుళం రూరల్, గార, ఎచ్చెర్ల మండలాల్లో ఎంపిక చేసిన 45 మంది నిరుద్యోగ యువతీ యువకులకు అగ్రి ఎంటర్‌ప్రెన్యూర్ పేరిట సింజెంటా పురుగుల కంపెనీ సౌజన్యంతో 36 రోజుల పాటు పలు స్వచ్ఛంద సంస్థలు రైతులకు అందించే సేవలు, పంటలు, వాటి యాజమాన్య పద్ధతులపై శిక్షణ నిచ్చారు. వీరందరికీ ఎమ్మెల్యే చేతుల మీదుగా శుక్రవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మరిన్ని సేవలు అందించేందుకు వీలుగా ప్రయోగాత్మకంగా వ్యవసాయ శాఖ సూచనలతో ఎంటర్‌ప్రెన్యూర్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. శిక్షణ పొందిన అభ్యర్థులు బ్యాంకుల రుణాలు పొంది రైతులకు మేలు చేసేలా షాపులు పెట్టుకొని ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షుడు శిమ్మ నేతాజీ, సింజెంటా ప్రతినిధి రామప్రసాద్, ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతు రామారావు, పోలాకి మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు ముద్దాడ బైరాగినాయుడు, గార ఎంపీపీ గొండు రఘు తదితరులు పాల్గొన్నారు.

సంచార పశుఆరోగ్యసేవ వాహనం ప్రారంభం


వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

నరసన్నపేట: డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్యసేవ వాహనాల ద్వారా పశువులకు మెరుగైన వైద్యం అందించాలని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సూచించారు. నియోజకవర్గానికి మంజూరైన రెండో సంచార పశువైద్య వాహనాన్ని ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే నరసన్నపేట, పోలాకి మండలాలకు సేవలు అందుతుండగా, కొత్త వాహనం ద్వారా సారవకోట, జలుమూరు మండలాల్లో పశువులకు వైద్య సేవలు అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో పశుసంవర్ధక అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి


సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ విద్యాసాగర్

జలుమూరు: సచివాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సిబ్బంది బాధ్యతగా పని చేయాలని డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్ అన్నారు. శుక్రవారం జలుమూరు మండలం కొమనాపల్లి సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయపాలనతోపాటు అర్హులైన వారికి సంక్షేమ ఫలాలు అందించాలన్నారు. రుణాలు చెల్లింపులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జలుమూరు మహిళా మండలి సమాఖ్య సిబ్బంది, వెలుగు ప్రతినిధులకు సూచించారు. సంఘాల బలోపేతానికి చర్యలు చేపట్టాలన్నారు. జగనన్న చేదోడు, చేయూత ద్వారా సంఘ సభ్యులు వ్యాపారాలు, ఆవులు పెంపకం, చేతివృత్తులు తదితరవి చేపట్టి జీవన ప్రమాణం మెరుగుపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానాల్లో ఆక్రమణలు అరికట్టాలి


ఎంబుక్‌ల అలసత్వంపై పీఆర్ ఏఈని ప్రశ్నిస్తున్న సభ్యులు

పోలాకి: మండల కేంద్రం పోలాకితో పాటు పలు పంచాయతీల్లో శ్మశానవాటిక స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయని, వాటిని అడ్డుకోవాలని సర్పంచ్ మజ్జి రమణమ్మ కోరారు. శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తలసముద్రం ఎంపీటీసీ భావన వైకుంఠరావు మాట్లాడుతూ రైతులకు రాయితీపై నీటి ఇంజిన్లు అందించాలని కోరారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ ఉపాధిహామీ నిధులతో జగనన్న లేఅవుట్లకు పనులు చేసినా ఇప్పటి వరకు బిల్లులు పెట్టలేదని ఏపీవో, పంచాయితీరాజ్ ఏఈని నిలదీశారు. ప్రభుత్వం బిల్లులు చెల్లించే నాటికి ఇక్కడ ఎంబుక్‌లు నమోదు కావటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటీ తహశీల్దార్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రీసర్వేకు సహకరించాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ ముద్దాడ దమయంతి, మండలపరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు ముద్దాడ బైరాగినాయుడు, వైస్ ఎంపీపీలు కలగదండు తాతారావు, కోట అప్పారావు, ఎంపీడీఓ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలం నేడు

పాతపట్నం: మండలంలోని ప్రహరాజపాలెంలో ఎస్ఈబీ ఆధ్వర్యంలో వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను శనివారం ఉదయం 10 గంటలకు వేలం వేయనున్నట్లు ఎస్ఈబీ సీఐ వై.లక్ష్మీనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ప్రహరాజ పాలెం ఎస్ఈబీ కార్యాలయంలో జరిగే వేలంలో ఆధార్, రూ.1000 డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చునని పేర్కొన్నారు.